క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం మార్పు

తంబళ్లపల్లె: తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం మండల కేంద్రంలోని ద్వారకనగర్‌లోకి మార్చుతున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. 1981లో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. ఉద్యోగులకు విధి నిర్వహణ కష్టంగా మారింది. దీంతో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు కార్యాలయాన్ని మార్చుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు



పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి విశేష పుష్పాలంకరణ చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని శివాలయాల్లో పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కురబలకోట: మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శిరీష (21) గురువారం ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టమాటా పంటకు ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మహాపూర్ణాహుతి



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, పవిత్ర వితరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర వితరణం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, చక్రస్నానం కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి వీధి ఉత్సవం కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, కృష్ణంరాజు భట్టర్, సిబ్బంది కృష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో వరద అంచనా



డ్రోన్ ఫ్లైతో వరద పరిస్థితిపై మున్సిపల్ అధికారుల సర్వే

మదనపల్లె : మున్సిపల్ పరిధిలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు సంబంధించి వరద అంచనా వేసేందుకు, నీటి నిల్వలను గుర్తించేందుకు డ్రోన్ ఫ్లై ద్వారా సర్వే నిర్వహించినట్లు కమిషనర్ కే.ప్రమీల పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కురవంక, రామ్‌నగర్, ప్రశాంత్‌నగర్, సప్తగిరినగర్, సొసైటీకాలనీ, బుగ్గకాలువ, మేదరవీధి తదితర ప్రాంతాల్లో రెండు డ్రోన్ల ద్వారా వరద పరిస్థితిని అంచనా వేశామన్నారు. ముందస్తు సహాయక చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు ఇప్పటికే పట్టణంలోని బుగ్గకాలువ, బాహుదాకాలువల్లో జేసీబీల సహాయంతో పూడికలు తొలగించి, నీరు సాఫీగా వెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తూ, అత్యవసరమైతే తీసుకోవాల్సిన చర్యలపై సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతానికి మూడురోజులుగా కురిసిన వర్షాలకు పట్టణంలో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తలేదని పేర్కొన్నారు.

సమయం పాటించాలి

నిమ్మనపల్లె : సచివాలయ ఉద్యోగులు సమయం పాటించాలని డీఎల్‌డీఓ అమరనాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొండయ్యగారిపల్లె గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో ఉదయం, సాయంత్రం వేళల్లో సమయానికి హాజరు వేయాలన్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను, పలు రికార్డులను, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

సంపద కరిగింది.. చెత్త మిగిలింది..!

స్వచ్ఛగ్రామాలే లక్ష్యంగా రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చెంత నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువులు తయారు చేసి తద్వారా అదనపు ఆదాయం సాధించాలనే లక్ష్యంతో వాటిని ఏర్పాటు చేసినా.. లక్ష్యం నెరవేరలేదు. చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురాకపోవటంతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

- మూలనపడ్డ చెత్త తయారీ యంత్రాలు
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- పేరుకు పోతున్న చెత్తకుప్పలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



మహబూబ్ నగర్ వీధిలో పేరుకు పోయిన చెత్తకుప్పలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ మేజర్ పంచాయతీలోని డంపింగ్‌యార్డులో చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రాలు మూలనపడ్డాయి. లక్షలాది రుపాయలు ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్‌యార్డు నిరుపయోగంగా మారింది. దీంతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో పారిశుద్ధ్యం పడకేసింది. వర్షానికి చెత్త కుళ్లి కంపుకొడుతోంది. అంటు వ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారటంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఏడేళ్ల క్రితం..

ఏడేళ్ల క్రితం గుర్రంకొండలో డంపింగ్‌యార్డు నిర్మాణం కోసం రూ. 30 లక్షలు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. డంపింగ్ యార్డును రూ. 5 లక్షలతో నిర్మించారు. అందులో రూ. 15 లక్షలు విలువ చేసే చెత్త నుంచి సంపద తయారీ చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో మూడు నెలల పాటు ఎరువు తయారు చేశారు. కొన్నాళ్ల తర్వాత డంపింగ్‌యార్డులో చెత్తసేకరణ, ఎరువుల తయారీ నిలిపివేశారు. అప్పటి నుంచి యంత్రాలను వినియోగించడం లేదు. దీంతో యంత్రాలు తుప్పు పట్టి శిథిలావస్థలో ఉన్నాయి.

మూలనపడ్డ యంత్రాలు

డంపింగ్ యార్డు మూతపడడంతో అక్కడి వస్తువులు మూలనపడ్డాయి. గతంలో అక్కడ కొన్నియంత్రాలు చోరీకి గురయ్యాయి. దీంతో వాటిని గ్రామ సచివాలయం-2 ఆవరణంలో ఉంచారు. ఏళ్ల తరబడి యంత్రాలను వినియోగించకపోవడంతో తుప్పుపట్టి పనికి రాకుండా పోయాయి. సచివాలయ ఆవరణలో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

వినియోగానికి నోచుకోని డంపింగ్‌యార్డు

గతంలో గుర్తుతెలియని వ్యక్తులు డంపింగ్‌యార్డు నిప్పు పెట్టడంతో కాలిబూడిదయింది. అందులోని సామగ్రి దగ్ధమైంది. మళ్లీ అధికారులు డంపింగ్‌యార్డులో మరమ్మతులు చేశారు. అయినా ఇంతవరకు డంపింగ్‌యార్డు వినియోగంలోకి రాలేదు. పట్టణంలో ప్రతిరోజు 750 కేజీల నుంచి టన్ను వరకు చెత్తను సేకరిస్తున్నారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డు లేకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. పట్టణంలోని పలు వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గధం వెదజల్లుతున్నాయి.

రేకులు చోరీ

మండలంలోని అమిలేపల్లెలో రెండేళ్ల క్రితం రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన డంపింగ్‌యార్డు షెడ్డు పైకప్పు రేకుల చోరీకి గురయ్యాయి. నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే దుండగులు రేకులు చోరీ చేశారు. అప్పట్లో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే అధికారులు చొరవ చూపకపోవడంతో ప్రస్తుతం డంపింగ్‌యార్డు నిరుపయోగంగా మారింది.

లాభం లేకపోతోంది



గ్రామంలో చెత్త సేకరిస్తున్నారు కానీ ప్రయోజనం లేకపోతోంది. ఆ చెత్తను రోడ్డు పక్కనే విడిచిపెడుతున్నారు. కుక్కలు, పందులు వ్యర్థాలను తీసుకొని రోడ్డుపైకి తెస్తున్నాయి. దీంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దుర్వాసనతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. – నాగరాజ, గుర్రంకొండ

విద్యుత్ సౌకర్యం లేదు



డంపింగ్‌యార్డు వినియోగానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం లేదు. డంపింగ్ యార్డు ఉన్న ప్రాంతంలో త్రీఫేస్ కరెంటు సరఫరా కావడం లేదు. విద్యుత్ సౌకర్యం లేక యంత్రాలు పనిచేయడం లేదు. ప్రతిరోజు టన్ను వరకు చెత్త వృధా అవుతోంది. – హరి, పంచాయతీ ఈఓ, గుర్రంకొండ

ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఆదరణ తగ్గలేదు

- ప్రభుత్వ వైఫల్యాలపై దృష్టి పెడదాం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని గోళ్లపల్లె పంచాయతీలో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న సమస్యలు, పార్టీ పరిస్థితులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజలు పొందారన్నారు. అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, వాటిని అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిందని, ఇచ్చిన మాటకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి పనిచేశారని కొనియాడారు. హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం నిధులు లేవని తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. దీంతో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 2019–24 వరకు చేసిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. సాగు, తాగునీటికి, రహదారుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో 75 ఏళ్లలో జరగని మార్పుని తీసుకొచ్చామని వివరించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మిషన్ రామిరెడ్డి, సర్పంచులు పుష్పలత, నాగిరెడ్డి, సాంబశివ, రుక్మిణీ, ఎంపీటీసీలు విమలమ్మ, ఈశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాసిర్, జేసీఎస్ కన్వీనర్ రెడ్డిహరి, కాండ్లమడుగు విజయారెడ్డి, సతీష్, బురకాయలకోట శీను పాల్గొన్నారు.

జీఓ 77ను వెంటనే రద్దుచేయాలి



మాట్లాడుతున్న మాధవ్‌కుమార్

మదనపల్లె : విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను రద్దుచేయాలని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల భవిష్యత్‌పై లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని బీటీ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మ ఒడి నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థులు గడచిన విద్యాసంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు గంగారాణి, కమలాకర్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడు



మదనపల్లె : వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని చెంబకూరురోడ్డు రాగిమాను సర్కిల్‌లోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్లు పాకాల శంకరమ్మ, రాజేష్, ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాకాల హరి, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్, అపర్ణ, గౌరమ్మ, కన్నా, నరేంద్ర పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్‌లో...

సబ్ కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. భరతభూమి ఎందరో మహనీయులు జన్మించిన పుణ్యభూమి అని, నేటితరం అలాంటి మహనీయుల జీవితచరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొంది, వారి మార్గంలో పయనించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలుగుతారని మేఘస్వరూప్ చెప్పారు.

వేడుకల్లో ఎమ్మెల్యే

వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జయంతి వేడుకలను రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడం శుభపరిణామన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

పీలేరు రూరల్ : రామాయణాన్ని అందించిన ఆదికవి వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకమని ఎంఈఓలు వై. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకావ్యమైన రామాయణాన్ని రాసిన గొప్పకవి వాల్మీకి అని కొనియాడారు. సీఆర్పీలు మురళీధర్‌రాజు, సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: రామసముద్రంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ, జిల్లా వాల్మీకి సంఘం నాయకుడు దొడ్డిపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి వాలెప్ప, కేశవ, బసప్ప, గోవిందప్ప, అంబరీష్, సుబ్బన్న, గంగాధర, విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న వాల్మీకుల డిమాండ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. గురువారం రామసముద్రంలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, వాల్మీకి సంఘం జిల్లా నాయకులు ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద్, విడిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేజల విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో వాల్మీకి జయంతి

బి.కొత్తకోట: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ భీమేశ్వరాచారీ, హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వాల్మీకి రచించిన గ్రంధాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే నగర పంచాయతీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి కమిషనర్ పల్లవి, మేనేజర్ రమాదేవి, సిబ్బంది నివాళులర్పించారు.

కురబలకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం అంగళ్లు కూడలిలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడ్ మల్లిఖార్జున నాయుడు, కామకోటి ప్రసాదరావు, రామమూర్తి, మల్లిఖార్జున, జస్వంత్, జయసూర్య పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

నిమ్మనపల్లె : మండలంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని తవళం, నిమ్మనపల్లి, దిగువపల్లిలో శ్రీ మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో వాల్మీకి సభ్యులతో పాటు, కూటమి నాయకులు మహర్షి వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. దిగువపల్లిలో వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా పూలమాల వేసి పూజలు చేశారు.



రామసముద్రం: అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డిపల్లి ఆనంద్



వాల్మీకి జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఎంఈఓ కార్యాలయంలో..

ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ పద్మావతి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి బోయ సాధికార సమితి కన్వీనర్ కె.లక్ష్మన్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె మండల కేంద్రంలో..

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంఈఓ త్యాగరాజు వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మానవాళికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

పెద్దతిప్పసముద్రం: వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శ ప్రాయుడని తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పీటీఎం, కందుకూరు, టి.సదుం గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు.

విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

కేవీపల్లె : మండలంలోని మహల్‌రాజుపల్లె పంచాయతీలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఈఓపీఆర్‌డీ గఫూర్ పర్యవేక్షణలో మహల్‌రాజుపల్లె పంచాయతీలోని వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించండి

పెద్దతిప్పసముద్రం: మండలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన కార్యదర్శులతో మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. వర్షాలకు ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లితే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఓఆర్డీ యోగానంద్ ఉన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

కేవీపల్లె : వర్షాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని జిల్లేళ్లమంద, నూతనకాల్వ, మారేళ్లలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వలన నీరు కలుషితమై వాంతులు, విరేచనాలు, జ్వరాలు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యాధుల భారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాజా ఆహారం తినాలని, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి




గొర్రెకు నట్టల నివారణ మందు తాపిస్తున్న డాక్టర్ తేజకల్యాణ్

కలికిరి: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయించాలని కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. వెంకటమునినాయుడు అన్నారు. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందులు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 వరకు మండలంలో ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మూగ జీవాల పట్ల చేపట్టవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కలకడ : ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎర్రకోటపల్లె పశువైద్యాధికారి డాక్టర్ తేజ కల్యాణ్ కోరారు. గురువారం మండలంలోని పాపిరెడ్డిగారిపల్లె, ముడియంవారిపల్లె కొత్తపల్లె గ్రామాల్లో గొర్రెలకు మరియు మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం 30 వరకు కొనసాగుతుందని తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని శ్రీ ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం దృష్టి అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్‌కు అవసరమైన విద్యార్థులను ఆస్పత్రికి రావాలని సూచించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి,ప్రిన్సిపాల్‌సతీష్‌బాబు,ఎన్ఎస్ఎస్ కమిటీ సభ్యులు ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పీలేరు : స్థానిక యల్లమంద క్రాస్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈ కొండయ్య మాట్లాడుతూ వర్షాలు కురిసిన నేపథ్యంలో వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం భార్గవి, ప్రమీల, చంద్రకళ పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

వాల్మీకిపురం: గురువారం స్థానిక షిరిడి సాయి బాబ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయి బాబకు అర్చన, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూజారి భక్తులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేయించి, సత్యనారాయణ వ్రతం విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

పీలేరు: పల్లె పండుగతో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టిందని ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. గురువారం మండలంలోని రేగళ్లు, బాలంవారిపల్లె, దొడ్డిపల్లె, ముదుపులవేముల, అగ్రహారం పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 31 లక్షలతో ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేస్తున్నట్లు చెప్పారు.

కలకడ : మండలంలోని ఎనుగొండపాళ్యం, దిగువతాండ, కదిరాయచెర్వు పంచాయతీలలో రూ.12.50 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్లు పనులకు ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ భూమిపూజ చేశారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ విమర్శించారు. గురువారం స్థానిక సంతగేటులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు కారణంగా పేద మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెరిగి సామాన్య ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయలు ధరలు తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.